ఈనాడు ఆదివారం (17 జులై 88)

# ప్రశ్న

"గురో! ఓ ప్రశ్న అడుగుతా! సెబుతావా?"

"అడుగసే!"

"కోప్పడగూడదు!"

"కోప్పడను! అడుగు!" గురువు హామీ ఇచ్చాడు.

గురువు పేరు కోటిలింగం

శిష్యుడి పేరు బద్రుద్దీన్.

"గురో! రాములోరు లేదా వెంకన్నసామి, సత్యశాయిబాబా, కాదంటే ఏసుప్రభు ఈల్లను కొలుస్తారు జనం. అల్ల బొమ్మను జేబులో ఎట్టుకుంటారు! అవునా?"

"ఆహా!" గురువు తలూపాడు. ఆ తర్వాత మరోగుక్క త్రాగాడు.

శిష్యుడు, గురువు గ్లాసులో మరో పెగ్గు వేసి, గోలీ సోడా వొంపి, -

"గురో, మరి నువ్వేటి, ఈ బొమ్మెట్టుకున్నావ్ జేబులో?" అంటూ గురువు ముహం లోకి చూశాడు.

"సూద్దామంటే పోనీ, బొమ్మలో మడిసి ఆడదీగాదు. ఆడదైతే, ముగం వాచినప్పుడు, దాని మొహం చూసి, మోహం తీర్చుకోవచ్చు. పోనీ చిన్నపిల్లదో, పిల్లాడిదో అయితే మమకారం కొద్దీ జేబిలో ఎట్టుకున్నావ్ అనుకోవచ్చు.మరి ఈ బొమ్మలో మడిసెవడు! ఆడు నీ జేబిలో ఉండేందుకు కథేంది? అది సెప్పు!"

గురువు సిగరెట్ ముట్టించాడు. గ్లాసులో మందు ముట్టలేదు. కిటికీలోంచి బయటకు చూశాడు.

వాన కురుస్తూ ఉంది. మూడు రోజుల్నుంచీ అదలా కురుస్తూనే ఉంది. కనుచూపు మేరంతా నీళ్లే.

"గురో! ఈ వాన ఇప్పుడే తగ్గదు. బ్రిడిజీ మీద పొంగు తగ్గదు. లారీలన్నీ బంద్ రేపు సూరీడొచ్చి, నీళ్ళు తగ్గితె, అప్పటిమాట! కథ చెప్పు!" అంటూ శిష్యుడు గురువు దగ్గిరగా

జరిగాడు.

గురువు గోడకు జారగిలబడ్డాడు. వెలిగించిన సిగరెట్ కాలుతూనే వుంది. గ్లాసులో మందు కదల్లేదు.

"అరేయ్, నువ్వేం సదివావ్?"

"నేనా, మూడు!" అన్నాడు శిష్యుడు.

"ఎందుకు సదవలేదు? మీ వాళ్ళు సెప్పించలేదా! నువ్వు బడెగ్గొట్టి గోలీలు, బిల్లం గోడులూ ఆడావా?"

"గురో, మా అమ్మ సచ్చేదాకా కంటూనే ఉంది. మా అయ్యి మిషను దొక్కుతూనే ఉన్నాడు. ఇక సదువు సెప్పించేదెవరూ? ఆకలిగదా! నేనే సదువు మానేసినాను. మరో ఇసయం గురో. మా ఇంట్లో ఎవరన్నా సత్తే ఏడవటం, పుడితే పండగ చేసుకోవడం లేదు. అన్నం దొరికితే పండుగ - అంతే!" శిష్యుడు తలొంచుకున్నాడు.

కోటిలింగం శిష్యుడి తల నిమిరాడు.

"మా అయ్య రైల్వేలో పనిచేసేవాడు. పెద్ద కొడుకునని నన్ను స్కూల్లో జేర్పించాడు. తొమ్మిదో తరగతి దాకా సదివా! సదివినా సదవకపోయినా తొమ్మిది దాకా ప్యాసవుతూ వచ్చా."

"తెలివిగలోడివన్నమాట!"

"ఏమో! కానీ నా పేరు సెబితె పంతుళ్ళకు హడల్. డ్రిల్లు సరిగ్గా సెయ్యలేదని వస్తాదు మాస్టరు గ్రౌండ్ బయటకు పంపితే, అడ్నిసితకదన్నా, స్కూలు ఫీజు కట్టలేదని పేరు నోటీసు బోర్డులో ఏస్తే ఆ గుమాస్తా పళ్ళు రాలగొట్టా. నేను బళ్ళో హీరోని! అందుకని నేనే క్లాసు తప్పలా!"

శిష్యుడు కోటిలింగానికి దూరంగా జరిగి భయంగా చూశాడు.

"తొమ్మిదిలో ఉండగా, ఓ కొత్త మేష్టరొచ్చాడు. కుర్రాడు, చాకులా ఉండేవాడు. కత్తిలా మెరిసేవాడు. లెక్కలు బాగా సెప్పేవాడు. అదే కారణం నా సదువు ఆగిపోటానికి!"

"ఏం చేశాడు?"

"హోంవర్కిచ్చాడు. సెయ్యిలా! మర్రోజూ అంతే! వారం అయింది. రోజూ అరిచేవాడు. కొత్త మేష్టరికి మన సంగతి తెలియదులే అనుకున్నా. ఊహూ. అడో రోజు, పబ్లికుగా క్లాసులో నా చెంప అదిరేలా కొట్టాడు."

"అమ్మ నా కొడుకూ! ఎంత ధైర్యం ఆడికి!"

"అంతేగాదు! చివాట్లెట్టాడు. దుంగలాగా ఉన్నావు. దున్నపోతులా ఉన్నావు. సిగ్గులేదూ! పుస్తకాల్లేవు. హోంవర్క్. సెయ్యవు! ఎందుకు క్లాసుకు రావడం. గెటవుట్ అని కూడా అన్నాడు"

శిష్యుడు మాట్లాడలేదు. గురువు సంగతి తెలుసు. అసాధ్యుడు. పోలీసోళ్ళంటేనే

లెక్కలేదు. గుండెలు తీసిన బంటు. లారీ ఆపగూడని చోట ఆపాడని చలాన్ చేయబోతే ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్నే తన్నాడు. కోటిలింగాన్ని చూస్తే లారీ యజమానికే భయం.

"గెటవుట్ అన్నాడు గదా! బయటకు వెళ్ళావా?" శిష్యుడు భయంగా అడిగాడు. "నాయాల్ని అక్కడే తన్నాల్సింది" అని కూడా అన్నాడు.

"తప్పలేదు! ఆ మేష్టరు రోజూ లోకల్‌లో వెడతాడు. స్టేషనుకు వెళ్ళా"

"అక్కడ తన్నావా?"

"నన్ను గెటవుట్ అన్న సంగతి హెడ్ మాస్టరుకు తెలిసింది. పంతుళ్ళకు తెలిసింది. స్టాఫ్‌రూంలో హెడ్మాష్టరూ, మిగతా పంతుళ్ళంతా చెప్పారుట 'కోటిలింగం జోలికెందు కెళ్ళావయ్యా స్వామీ! వాడసలె రౌడీ! ఒంటరిగా దొరికితే తంతాడు. కాలో చెయ్యో విరిచేస్తాడు. వెళ్ళి క్షమాపణ చెప్పుకో! మేమంతా కూడా వాడిని బ్రతిమిలాడుతాం అని. కానీ ఆ కొత్తమేష్టరు వినలేదట. నేను చదువు చెప్పేందుకూ, చదవని వాళ్ళ చేత చదివించేందుకూ వచ్చాను. కలెక్టరు కొడుకైనా, కానిస్టేబుల్ కొడుకైనా నాకు ఒకటే! క్లాసులో అల్లరి చేసినా, పాఠం వినకపోయినా, హోంవర్కు చెయ్యకపోయినా, శిక్షిస్తాను. వాడు తంతాడని భయపడి నా డ్యూటీ మానను అని మొరాయించాడట."

"గురో ఆ టీచరెవడో అసాధ్యుడు సుమా!"

గురువు మాట్లాడలేదు.

బయట వాన కురుస్తూనే ఉంది. పాకలో పొగ, గ్లాసులు కప్పుల చప్పుడు.

కోటిలింగం ఆవులించాడు.

జేబులోంచి బొమ్మ తీసి చూశాడు.

"ఈ మేష్టరు, నిర్భయంగా లోకల్ ట్రెయిన్‌లో, కిటికీ ప్రక్కనే కూర్చునున్నాడు, ఏమీ జరగనట్లు. నా వెనుక నలుగురు స్నేహితులు. మేష్టరు మమ్మల్ని చూశాడు. చూసి నవ్వాడు. మిగతా మేష్టర్లంతా భూకంపం వస్తుంది అన్నట్లు ముడుచుకుపోయి కూర్చున్నారు. వాళ్ళ కళ్ళల్లో భయం, ఏం జరుగుతుందోనని!"

శిష్యుడు ఆ దృశ్యాన్ని ఊహించుకున్నాడు. కోటిలింగం, పిచ్చికుక్క లాగా, క్రొత్త మేష్టరును కరిచేసి ఉంటాడు. బెబ్బులి లాగా పీకేసి ఉంటాడు. కళ్ళూ, కాళ్ళూ, చేతులూ ఊడదీసి ఉంటాడు.

"కిటికీ దగ్గరకెళ్ళా. వెళ్ళి 'రైలు దిగండి' అన్నా!"

"అయితే వాడిని ఫ్లాట్ ఫారం మీదకు రప్పించి తన్నావా?"

"లేదు. దిగమన్నా - ఆ మేష్టరు రైలు దిగాడు. మిగతా మాష్టర్లంతా చూశారు గుడ్లప్పగించి"

రైలు కదిలి వెళ్ళిపోయింది.

"ఎవ్వరూ లేకుండా చూసి పని కానిచ్చావన్నమాట!"

"కాదు"

శిష్యుడికి ఏమీ అర్థంగావటం లేదు. ఓ మేష్టరును తన్నటానికి ఇంత ఆలోచన దేనికీ?

"మా ఇంటికి రాండి!" అన్నా.

"పద" అని మేష్టరన్నాడు.

"మా ఇంటికి తీసుకెళ్ళా.

మా ఇల్లు గుడిసె. మా అమ్మ ఆరు బయట అన్నం వండుతున్నది. మాష్టరును లోపలకు తీసుకెళ్ళా! నులక మంచం మీద మా అయ్య, ఆడి ప్రక్కలో ఆడి ఉంపుడె గత్తె, క్రింద నేల మీద ఖాళీ అయిన రమ్ము సీసా!

ఇవన్నీ మాస్టరుకు చూపించా!

ఆయన చూశాడు.

బయట కొచ్చాం!

మా అమ్మ బొమికెలకు పాత చీర చుట్టుకుని వింతగా మాకేసి చూస్తూ నిలబడింది భయంగా!

'ఇది మా ఇంటి పరిస్థితి ఇప్పుడు చెప్పండి. నే పుస్తకాలు లేకుండా ఎలా చదివేది, హోంవర్కు చెయ్యలేదని తిట్టారు! ఎక్కడ హోంవర్కు చేసేది? ఏంబెట్టి చేసేది? ఎలా చదివేది?'

మేష్టరు మాట్లాడలేదు. నా వేపు జాలిగా చూశాడు. భుజం మీద చెయ్యేసి, 'రా పోదాం' అని వెంటతీసుకెళ్లాడు.

ఇద్దరం మళ్ళీ స్టేషను కెళ్ళాం. ప్లాట్‌ఫారంమీద ఓ మూలగా ఉన్న సిమెంట్‌బెంచీ మీద కూర్చున్నాం."

కోటిలింగం చెప్పడం ఆపి కిటికీలోంచి బయటకు చూశాడు. సాయంత్రం నాలుగింటికే వెలుతురు తగ్గింది. కనుచూపు మేరంతా వానతో, చెట్లు, చేమ, కొండలూ, పొలాలూ అన్నీ కలిసిపోయాయి. ఇద్దరు ముగ్గురు డ్రైవర్లు తడిసి లోపల కొచ్చారు.

"మీ అయ్యకి ముండగూడ ఉందా?"

"మా అయ్యకి లేని అలవాటు లేదు. త్రాగుతాడు. బ్రాకెట్ ఆడతాడు. మా అమ్మ వంట్లో సత్తువ, అందం ఉన్నంత కాలం సుఖపెట్టాడు. ఆమెతో సుఖం లేదనుకున్నాక, వేరేదాన్ని తెచ్చాడు. పిల్లలున్నా పెళ్ళాం ఉన్నా ఆడికి బెదురులేదు. ఆడూ, ఆడిముండా, లోపల గుడిసెలో సరసాలాడుతా ఉంటే, మా అమ్మ, నేను, ఇద్దరూ తమ్ముళ్ళూ, చూరు క్రింద తలదాచుకునేవాళ్ళం. చలైనా, వానైనా ఒరేయ్! ఆడు తండ్రిగాదురా! దున్నపోతు!" కోటిలింగం కళ్ళు, చింతనిప్పుల్లా అయ్యాయి. వళ్ళంతా ఆవేశం, కసితో బిగుసుకు పోయింది.

శిష్యుడి కళ్ళు చెమ్మగిల్లే ఉన్నాయి.

"నాయాల ఈమధ్దెనే పక్షపాతం వచ్చి రైలు స్టేషన్‌కాడ అడుక్కుతింటున్నాడని తెలిసింది! నాయాల కంతె కావాలి!"

"గురో! ఏమనుకోమాక! ఎంతయినా కన్న తండ్రి గదా! దయి చూడాలి!"

"తండ్రిగాదు అడు - పశువు - ఎనుబోతు. కన్నాడు అంతే! మాకేం చేశాడు! గాలికి పెరిగాం!"

"మరి మీ తమ్ముడు డిప్టీ కలెక్టరు, ఇంకోడు సర్కిలినిస్పెక్టరంటివా? వాల్లెలా గయ్యారు?"

గురువు ఆగాడు. సిగరెట్ ముట్టించాడు.

"నువ్వడిగిన ప్రశ్నలన్నింటికీ జవాబు సెబుతా! ఈ రేత్రికి మనం ఇక్కడే ఉండాలి! సేటుకు చెప్పు, భోజనం తయారు చెయ్యమని!"

శిష్యుడు లోపలికెళ్ళి చెప్పొచ్చాడు. "ఇంక మిగతా కథ చెప్పు! సిమెంటు బెంచీ మీద కూర్చున్నారు. ఆ తర్వాత....."

"కొత్త మేష్టరన్నాడు. కోటిలింగం చదువు మానెయ్యి! అనీ"

"మేష్టరై ఉండి చదువు మానమనటమేమిటీ?"

"అదే నేనూ అడిగా! 'అసలే లేనోళ్ళం చదువు కూడా మానేస్తే ఎట్టా బ్రతకాలి?" అని. అందుకు కొత్త మేష్టరు ఏమన్నాడంటే -

'కోటిలింగం, నువ్వు ఇంతవరకూ చదివిందీ, ప్యాసయిందీ, గొప్ప విశేషం. పబ్లిక్ పరీక్షలలో నీ ప్రతాపం సాగదు. ఖాయింగా ఫెయిల్ అవుతావు. ఎందుకిదంతా! నీకు చదువు కూడుబెట్టదు. ఏదైనా వృత్తిలో చేరు. డబ్బు సంపాయించుకుని, నీ కాళ్ళ మీద నువ్వు నిలబడు. నీ తమ్ముళ్ళను నీ సంపాదనతో చదివించు. పెద్దవాళ్ళను చెయ్యి. నీ బ్రతుకు నాశనమైనా వాళ్ళయినా బాగుపడతారు. అంతేగానీ అందరూ చెడిపోవడం మంచిదిగాదు!" అన్నాడు.

ఆ రాత్రంతా ఆలోచించా! మా అమ్మను సలహా అడిగా!"

"నీ యిష్టం అంది!"

మర్రోజే మిలటరీలో చేరిపొయ్యా!"

"ఆ మేష్టరు బొమ్మేనా ఇది!"

"అవును ఆయనది! మిలిటరీలో చేరి ఆ డబ్బుతో నా తమ్ముళ్ళను చదివించా"

"మరి పెళ్ళి చేసుకోలేదేం?"

"మా మేష్టరు వద్దన్నాడు?"

"అదేం?"

"నాయినా! పెళ్ళయితే స్వార్థం వస్తుంది. నీ పెళ్ళాం, పిల్లల మీదున్న ప్రేమ తమ్ముళ్ళ

మీదుండదు. వాళ్ళ చదువులు, బ్రతుకులు అర్థాంతరంగా ఆగిపోతాయి. మమకారం, అభిమానం తగ్గుతాయి. అళ్ళ పిల్లలే నీ పిల్లలనుకో!' అన్నాడు. నాకూ అవుననిపించింది. మానేశాను.''

''గురో! నిజంగా ఆ మేష్టరు దేవుడే సుమా!'' అన్నాడు శిష్యుడు క్షణం ఆలోచించి.

''అవునురా ఆయన దేవుడు! చదవకపోతే కొట్టాడు. ఎందుకు చదవటం లేదో తెల్సుకుని దారి చూపాడు. అరెయ్! నా తమ్ముళ్ళు నే కనబడితే ఒకడు డిప్టీ కలెక్టరుగదా, అయినా సరె, నన్ను చూడగానే, నా ఖాకీ దుస్తులు, అటి మీద అయిల్ మరకలు, కొబ్బరి పీచులా నా జుత్తు, స్ఫోటకం మచ్చల నా ముఖం, ఇంత ఇకారంగా ఉన్నానా! అయినా సరే, ఆడు నే కంటబడితే చాలు! లేచి నిలబడతాడు. అంతేగాదురోయ్. కలెక్టరున్నా. తాశీల్దారున్నా వాళ్ళతో చెబుతాడు'' - కోటిలింగం గొంతు బొంగురు పోయింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి.

''అళ్ళతో అంటాడు! - 'మా అన్నయ్య సార్! మా అన్నయ్య. ఆయన వల్లె ఇంతవాళ్ళం అయ్యాం సార్! ఆయన మమ్మల్ని ఆదుకోకపోతే, అడుక్కుతింటూనో, జేబులు కొడుతూనో, జైల్లోనో ఉండేవాళ్ళం సార్!' అంటాడురా! అప్పుడొరేయ్! నాకు ఏనుగెక్కినట్లు ఉంటుందిరా! అలా ఏనుగెక్కిన సంతోషంలో నా కెవరూ గుర్తురారురా! మేష్టరు గుర్తొస్తారు. ఆయన వల్ల గదా ఇంత ఆనందం నా కొచ్చింది. ఆయన దేవుడురా. అందుకే ఆయన బొమ్మ జేబులో పెట్టుకుంటా! రోజూ లారీ ఎక్కేప్పుడూ, దిగేప్పుడూ ఆయనను తల్చుకుంటా! నమస్కారం బెడతా! ఆయనరా నాకు తండ్రి!'' - కోటిలింగం ఆనందంతో ఊగిపోయాడు.

శిష్యుడు తలొంచుకున్నాడు. తల వంచుకునే గొణుక్కున్నాడు.

''గురో! నాకో అన్నయ్య ఉన్నాడు. డబ్బున్నోళ్ళకు పెంపకం వెళ్ళాడు. నే కనపడితే మాట్లాడడు. చూడడు. పలకరిస్తే 'నా తమ్ముడినని ఎవరికన్నా చెప్పావో చంపేస్తా' అన్నాడు''.

గురువు ఆ మాటలు వినలేదు. ఆ కళ్ళల్లో నీళ్ళూ చూడలేదు.

అదే పాక హోటల్లో టీ తాగుతూ ఆ లారీ డ్రైవరూ క్లీనర్ల మాటలు వింటున్న నేను వాళ్ళను చూశాను.

నాకు సమాధానం దొరకని ప్రశ్న ఒకటి ఉండిపోయింది!

క్లాసులోనుంచి వెళ్ళిపొమ్మన్న మాష్టర్ని కోటిలింగం కొట్టకుండా ఎందుకు వదిలాడు అని!

అడుగుదామంటే కోటిలింగం ఆనందపు అలల్లో మునిగి ఉన్నాడు. అతని ఆనందాన్ని పాడు చెయ్యడం నా కిష్టం లేదు!

'ప్రశ్న' అలాగే మిగిలి ఉంది నా మనసులో.